క్లుప్తంగా

'పల్స్ పోలియో' విజయవంతం చేయండి

లింగాపూర్: మండలంలో మార్చి 3 నుంచి 5వ తేదీ వరకు నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైద్యాధికారి అజీమొద్దీన్ బుధవారం తెలిపారు. గ్రామాల్లోని ప్రతీ ఇంటికి వెళ్లి ఐదేళ్లలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయాలన్నారు.

ఆధ్యాత్మిక మార్గంలో నడవాలి


భోగ్ బండార్ నిర్వహిస్తున్న బాబుసింగ్

లింగాపూర్: మహారాష్ట్రలోని పౌరాదేవి ఆలయ పూజారి సంత్ శ్రీ రామరావ్ మహరాజ్ మనమడు శ్రీబాబుసింగ్ మహరాజ్ మండలంలోని జగదాంబదేవి ఆలయాన్ని బుధవారం సందర్శించి భోగ్ బండార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భక్తులు వచ్చే నెల 8వ తేదీ నుంచి సేవాలాల్ మహరాజ్ దీక్షలు ప్రారంభమవుతాయన్నారు. ఆలయ పూజారి మంగులాల్, హసీరాం, కిరణ్‌నాయక్, అర్జున్, కైలాస్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చతుర్థి పూజలు


ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకులు

ఆసిఫాబాద్‌అర్బన్: సంకష్టహర చతుర్థి పురస్కరించుకొని బుధవారం రాత్రి 7గంటలకు జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణవాడ గణపతి దేవాలయంలో అర్చకులు శ్రీనివాస్‌శర్మ, ఒజ్జల శిరీష్‌శర్మల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో వినాయకునికి అభిషేకం, అష్టోత్తర శతనామావళి, ఏకదశ ఉపనిషత్తులు, పుష్పార్చన, మంగళహారతి, మహామంత్రపుష్పాన్ని నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాద వితరణ చేపట్టారు. చతుర్థిని పురస్కరించుకొని ఉపవాస దీక్షలను రాత్రి 9.30 గంటల తర్వాత చంద్రదర్శనం అనంతరం ఉపవాస దీక్షలు విడిచారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

అయోధ్యకు తరలివెళ్లిన భక్తులు

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్ నుంచి బుధవారం రాత్రి భక్తులు అయోధ్యకు తరలివెళ్లారు. పలు మండలాల నుంచి 500 మంది భక్తులు ప్రత్యేక రైలు ద్వారా అయోధ్యకు బయలుదేరి వెళ్లారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో అయోధ్యకు వెళ్లే భక్తులకు సౌకర్యాలు కల్పించారు.

4న మహిళలకు ఆటల పోటీలు

రెబ్బెన: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని బెల్లంపల్లి ఏరియాలో మార్చి 4న మహిళలకు ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు ఏరియా పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 4న సాయంత్రం 4 గంటలకు మాదారం టౌన్‌షిప్‌లోని కమ్యూనిటీ హాల్‌లో, 5న గోలేటి టౌన్‌షిప్‌లోని జీటీసీవోఏ క్లబ్‌లో, 6న గోలేటి టౌన్‌షిప్‌లోని సింగరేణి ఉన్నత పాఠశాల మైదానంలో ఆట, పాటల పోటీలు, సాంస్కృతిక పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆసక్తి ఉన్న మహిళలు తమ పేర్లను పర్సనల్ డిపార్టుమెంట్ కార్యాలయంలో నమోదు చేసుకోవాలని సూచించారు.

శాస్త్ర సాంకేతిక రంగాలపై అవగాహన ఉండాలి

నార్నూర్: శాస్త్ర సాంకేతిక రంగాలపై పాఠశాలల స్థాయి నుంచే విద్యార్థులు పట్టుసాధిస్తూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా రాయి సెంటర్ సార్ మేడి మెస్రం దుర్గు పటేల్ అన్నారు. బుధవారం మండలంలోని జామ్‌డా గ్రామంలోని బాలికల ఆశ్రమ పాఠశాలలో సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం పాఠశాలలో ఏర్పాటు చేసిన సైన్స్‌ఫేర్‌ను పీఎంఆర్సీ ఇన్‌చార్జి జగన్‌తో కలిసి ప్రారంభించారు. విద్యార్థులు వారి ఆలోచనలతో ఏర్పాటు చేసిన పరికరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాలలో చదువుకుంటున్న గిరిజన విద్యార్థులకు గ్రామీణ నేపథ్యం ఉన్నప్పటికీ మారుతున్న కాలానికి అనుగుణంగా శాస్త్ర సాంకేతిక రంగాలపై పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు పట్టు సాధించాలన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యానికి అనుగుణంగా వారి ఆలోచన మేధాశక్తిని గమనించి వారిచేత కొత్త ప్రాజెక్టులు తయారుచేయించాలన్నారు. ఆశ్రమ పాఠశాల విద్యార్థులు వినూత్న ఆలోచనలతో నిత్యజీవితంలో ఎదుర్కొనే సమస్యలకు పరిష్కారం చూపేలా ప్రాజెక్టు రూపకల్పన చేసి ఔరా అనిపించుకున్నారు. ప్రధానోపాధ్యాయుడు చౌహాన్ నెహ్రు, పిడి ఆడే విశ్వనాథ్ ఉన్నారు.

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం

- సీవీ రామన్‌కు ఘన నివాళులు


పెంచికల్‌పేట్: విద్యార్థి ప్రాజెక్టును పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని సర్ సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. జెడ్పీఎస్ఎస్‌లో కాంప్లెక్స్ హెచ్ఎం విజయ నిర్మల విద్యార్థుల ప్రాజెక్టులను పరిశీలించారు. కేజీబీవీలో విద్యార్థినులు సైన్స్ ప్రాముఖ్యతపై రంగురంగుల బొమ్మలు వేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లింగాపూర్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో బుధవారం ఘనంగా జాతీయ సైన్స్‌డే జరుపుకున్నారు. ఉపాధ్యాయులు నీలాబిందు, యువరాజ్, మోయినోద్దీన్, రాంజీ పాల్గొన్నారు.

వాంకిడిలో..

వాంకిడి: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీవీ రామన్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆయా పాఠశాలల విద్యార్థులు పేపర్లతో తయారు చేసిన నూతన ఆవిష్కరణలు ఆకట్టుకున్నాయి. కనర్గాం పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు మహేందర్, ఉపాధ్యాయులు ప్రీతం సింగ్, రజిత, శ్రీవాణి, ఇస్తారి ఓమన్, తదితరులు పాల్గొన్నారు.

సిర్పూర్(టి): మండలంలోని వేంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా సైన్స్ అధికారి కటుకం మధుకర్ పాఠశాలలో విద్యార్థులు తయారు చేసిన సైన్స్ పరికరాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సైన్స్ ద్వార జరిగే అభివృద్ధి, సైన్స్‌లో కృషి చేసిన శాస్త్రవేత్తలను పరిచయం చేయడమే సైన్స్ దినోత్సవ ఉద్దేశమన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి సైన్స్ దినోత్సవం గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వేణుగోపాల్‌రావ్, సైన్స్ ఉపాధ్యాయులు స్వరూప, లావణ్య, ఓం ప్రకాశ్, సుగుణ, శ్రీలత పాల్గొన్నారు.

కౌటాల: విద్యార్థులు సైన్స్‌పై పట్టు సాధించాలని హెచ్ఎం నారాయణ్‌సింగ్ అన్నారు. కౌటాల జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో ముందుండాలన్నారు. రానున్న పదో తరగతి వార్షిక పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని తెలిపారు. అనంతరం సైన్స్ ఉపాధ్యాయులు కవిత, రజితను స్థానిక ఉపాధ్యాయులు శాలువాతో సన్మానించారు. కౌటాల కేజీబీవీ పాఠశాలలో సైతం సైన్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాల్లో ఎస్‌వో పవిత్ర, ఉపాధ్యాయులు రమేశ్, శ్యాంరావు, రాంచందర్, సంతోష్, సత్యనారాయణ, బీఈడీ శిక్షకులు ప్రీతి, మౌనిక, మహేశ్వరి, సోని, శరణ్య, సీఆర్పీ దేవన్న తదితరులు పాల్గొన్నారు.

కెరమెరిలో..

కెరమెరి: జాతీయ సైన్స్ దినోత్సవంలో భాగంగా మండలంలోని హట్టి ఆశ్రమ ఉన్నత పాఠశాల, హట్టి, మోడి, అనార్‌పల్లి, కేజీబీవీ మోడి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు గోయగాం, కెరమెరి సావర్‌కెడా, సాంగ్వి, కెలిబి, ఝురి తదితర ప్రాథమిక పాఠశాలల్లో బుధవారం ఘనంగా సైన్స్ ఎగ్జిబిషన్‌ను జరుపుకున్నారు. ఈ సందర్భంగా సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేశారు. ఎంఎస్‌వో ప్రకాశ్ కాంప్లెక్స్ హెచ్ఎంలు చంద్రశేఖర్, రుక్సానా బేగం తదితరులు ఉన్నారు.


కెరమెరి: గోయగాం జెడ్పీఎస్ఎస్‌లో..


కౌటాల పాఠశాలలో సైన్స్ డే వేడుకలు


సిర్పూర్(టి): నివాళులర్పిస్తున్న విద్యార్థులు

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం



బెజ్జూర్: పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులు

దహెగాం: ఇంటర్ ప్రథమ సంవత్సరం వార్షిక పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని ఇంటర్ పరీక్ష కేంద్రంలో ప్రథమ సంవత్సరం విద్యార్థులు 142 మందికి గాను 134 మంది విద్యార్థులు హాజరయ్యారని, 8 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు సీఎస్ అమరేందర్ తెలిపారు.

సిర్పూర్ (టి)లో..

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం జరిగిన ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర వార్షిక పరీక్షలు ప్రశాంతంగా కొనసాగాయి. మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళా శాల, సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల, కళాశాల, సాంఘిక సంక్షేమ డీపీఐపీ బాలికల గురుకుల పాఠశాల, కళాశాల, సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాల(కాగజ్‌నగర్), కస్తూరిబా గాంధీ బాలికల కళాశాలల ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర విద్యార్థులకు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో వార్షిక పరీక్షలు నిర్వహించారు. వార్షిక పరీక్షల్లో మొత్తం 404 మంది విద్యార్థులకు గాను 395 మంది విద్యార్థులు హాజరవ్వగా 9 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు సీఎస్ రమేశ్ తెలిపారు. వార్షిక పరీక్షలకు సిర్పూర్(టి) ఎస్సై దీకొండ రమేశ్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

కౌటాలలో..

కౌటాల: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఇంటర్ వార్షిక మొదటి సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పరీక్ష కేంద్రాన్ని కౌటాల సీఐ సాధిక్ పాషా, ఎస్సై మధుకర్, సిట్టింగ్ స్క్వాడ్ సంజీవ్ పరిశీలించారు. పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. పరీక్షకు నిమిషం నిబంధన అమలులో ఉండడంతో విద్యార్థులు పరుగులు తీశారు. సిబ్బంది విద్యార్థులను తనిఖీ చేసి కేంద్రంలోకి అనుమతించారు. తొలిరోజు పరీక్షకు 375 మంది విద్యార్థులకు గాను 351 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. 24 మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరయ్యారని సీఎస్ బాలకిషన్ రావు, డీవో డి దౌలత్ తెలిపారు.

బెజ్జూర్‌లో..

బెజ్జూర్: ఇంటర్మీడియెట్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 201 మంది విద్యార్థులకు గాను 187 మంది పరీక్షలకు హాజరు కాగా, 14 మంది గైర్హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ దుర్గం జ్ఞానేశ్వర్, డీవో గణపతి తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న పరీక్ష కేంద్రాన్ని ఎస్సై విక్రం పరిశీలించారు.

రెబ్బెనలో..

రెబ్బెన: మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఇంటర్ వార్షిక పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు పరీక్షకు 554 మంది విద్యార్థులకు 25 మంది విద్యార్థులు గైర్హాజరు కాగా, 529 మంది విద్యార్థులు హాజరైనట్లు సీఎస్ పాగిడి ప్రకాశ్ తెలిపారు.

కెరమెరి: ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షల్లో భాగంగా మొదటిరోజు పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం కొనసాగిన ఫస్ట్ ఇయర్ సెకండ్ లాంగ్వేజ్ పరీక్షలో 145 మంది విద్యార్థులకు 141 మంది విద్యార్థులు హాజరైనట్లు సీఎస్ పర్శరాములు, డీవో సునీల్ కుమార్ తెలిపారు. ఐదు గదుల్లో విద్యార్థులు పరీక్షలు రాయగా ఆరుగురు ఇన్విజిలేటర్లుగా వ్యవహరించారు.

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ పట్టణంలో బుధవారం ఇంటర్మీడియెట్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పట్టణంలో మూడు పరీక్షా కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. 8.30 గంటల నుంచే విద్యార్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించారు.


దహెగాం: విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది


కౌటాల: విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

చదువుతోపాటు విలువలు నేర్పించాలి


ప్రదర్శనలు పరిశీలిస్తున్న సీఐ శంకరయ్య

కాగజ్‌నగర్‌రూరల్: విద్యార్థులకు చదువుతో పాటు కుటుంబ విలువలు తెలియజేయాలని పట్టణ సీఐ శంకరయ్య అన్నారు. బుధవారం పట్టణంలోని శ్రీచైతన్య పాఠశాలలో స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాంలో భాగంగా కుటుంబ ఆత్మీయ వేడుక, సైన్స్‌ఫేర్ కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సీఐ మాట్లాడుతూ ఉమ్మడి కుటుంబాల వల్ల బంధుత్వాలు, వారి మధ్య ఉండే బంధాల గురించి పెద్దలు, పిల్లలకు చెప్పేవారని, కానీ నేడు ఆ పరిస్థితి లేదన్నారు. కుటుంబ వ్యవస్థ గురించి పిల్లలకు ప్రత్యేకంగా కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాధ రేష్మి జయస్, అకాడమిక్ డీన్ లింగాల శ్రీధర్, ప్రైమరీ ఇన్‌చార్జి మహిమ కుమారి, ప్రీ ప్రైమరీ ఇన్‌చార్జి హేమలత, ఏవో అవినాష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'పది'లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి


పెన్నులు పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు

కౌటాల: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని హెచ్ఎం నారాయణ్ సింగ్ అన్నారు. బుధవారం కౌటాల జెడ్పీ ఉన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు ఉచితంగా పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిలుకూరి లక్ష్మీ టెంపుల్ హైదరాబాద్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పెన్నులు పంపిణీ చేసినట్లు తెలిపారు. విద్యార్థి దశ నుంచే అన్ని రంగాల్లో రాణించాలన్నారు. భయం వీడితే విజయం సాధిస్తారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేశ్, శ్యాంరావు, రాంచందర్, కవిత, రజిత, బీఈడీ శిక్షకులు ప్రీతి, మౌనిక, మహేశ్వరి, సోని, శరణ్య తదితరులు పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పని చేయాలి


మాట్లాడుతున్న ఎంపీపీ నానయ్య

చింతలమానెపల్లి: అధికారులు సమన్వయంతో పని చేయాలని ఎంపీపీ డుబ్బుల నానయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు తమ శాఖల నివేదికలను చదివి సభ్యులకు వినిపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలాధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని తెలిపారు. గ్రామాల్లో ఉపాధిహామీ పనులు ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. రైతుల పొలాల్లోకి వెళ్లేందుకు మట్టి రోడ్లు వేయాలన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో మిషన్ భగీరథ నీరు రావడం లేదని, వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చూడాలని పేర్కొన్నారు. డబ్బా -ధరంపల్లి పాఠశాల భవన నిర్మాణ పనులు చేపట్టాలని తెలిపారు. తహసీల్దార్ నాగరాజ్‌గౌడ్, ఎంపీడీవో ప్రసాద్, జెడ్పీటీసీ సభ్యులు డుబ్బుల శ్రీదేవి, కోఆప్షన్ సభ్యులు నాజీం, ఎంఈవో సోమయ్య, ఏవో రామకృష్ణ, ఏఈ రవీందర్, సూపర్‌వైజర్ శంకరమ్మ తదితరులు పాల్గొన్నారు.

బెంగాలీ నామశూద్రులకు ఎస్సీ హోదా కల్పించాలి


వినతిపత్రం అందజేస్తున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

కాగజ్‌నగర్‌రూరల్: బెంగాలీ నామశూద్రులను ఎస్సీ జాబితాలో చేర్చాలని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ జాతీయ ఎస్సీ కమిషన్ డైరెక్టర్ సునీల్‌కుమార్ బాబును కోరారు. బుధవారం హైదరాబాద్‌లోని జాతీయ ఎస్సీ కమిషన్ ప్రాంతీయ కార్యాలయంలో డైరెక్టర్‌కు బెంగాలీలతో కలిసి వినతిపత్రం అందజేశారు. 1971లో శరణార్థులుగా వచ్చి జిల్లాలోని సిర్పూర్ నియోజకవర్గంలో స్థిరపడిన వేలాదిమంది నామశూద్ర కులస్తులను ఎస్సీ జాబితాలో చేర్చాలన్నారు. అనేక రాష్ట్రాల్లో నామశూద్రులను ఎస్సీలుగా గుర్తించి రిజర్వేషన్లు అమలు చేస్తున్నారని గుర్తుచేశారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం


క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

సిర్పూర్(టి): ఉచిత విద్యుత్తు, రూ.500లకే గ్యాస్ పథకాలు అమలు చేసినందుకు బుధవారం మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని నిరుపేద ప్రజల పక్షాన కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందని, ఇచ్చిన హామీలను తప్పకుండా నెరవేరుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అబ్దుల్ షకీల్, తిరుపతి, సమీర్ హుస్సేన్, లెండుగురె శంకర్, రమేశ్‌గౌడ్, తిరుపతి, రవి, ఇప్ప రవిశంకర్, రఘునాథ్, దిలీప్, శ్రీనివాస్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

జైనూర్: కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న రూ.500లకే గ్యాస్, ఉచిత విద్యుత్తు పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు పేర్కొన్నారు. మండల అధ్యక్షుడు అబ్దుల్‌హమీద్, హైమద్‌ఖాన్, రమేశ్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

చతుర్విధ ప్రక్రియలు రావాలి

కెరమెరి: విద్యార్థులకు చతుర్విధ ప్రక్రియలు రావాలని ఎంఎస్‌వో ఆడే ప్రకాశ్, కెరమెరి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్ అన్నారు. బుధవారం మండలంలోని కెలిబి, సాకడ, బారేమోడి, సుల్తాన్‌గూడలో ప్రభుత్వ పాఠశాలలను ఆయన సందర్శించారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరును పరిశీలించారు.

నేటితో ముగియనున్న రేషన్ ఈకేవైసీ

- జిల్లాలో 72.93 శాతం పూర్తి
- వృద్ధులు, చిన్నపిల్లల వేలిముద్రలు పడక ఇబ్బందులు

ఆసిఫాబాద్: బోగస్ రేషన్ కార్డుదారులను తొలగించాలనే ఉద్దేశంతో తెలంగాణ ప్రభుత్వం ఆధార్ నంబర్‌తో ఈకేవైసీ చేయాలని నిర్ణయించింది. ఈ క్రమంలో రేషన్ కార్డులోని లబ్ధిదారులు రేషన్ దుకాణాల్లోని ఈపాస్ మిషన్లపై వేలిముద్రలు వేయాల్సి ఉంటుంది. ప్రభుత్వ నిర్ణయంతో రాష్ట్ర వ్యాప్తంగా రేషన్ కార్డు లబ్ధిదారులు రేషన్ దుకాణాల్లో వేలి ముద్రలు వేసి ఈ కేవైసీ నమోదు చేసుకుంటున్నారు. ఈ కేవైసీకి ప్రభుత్వం ఇప్పటికే పలుమార్లు గడువు పెంచుతూ వస్తుండగా, తాజాగా ఫిబ్రవరి 29 వరకు గడువు విధించింది. జిల్లాలోని అన్ని మండలాల్లో రేషన్ దుకాణాల్లో ఈకేవైసీ సేకరిస్తున్నారు. ఇందుకోసం ఆధార్ ధ్రువీకరణ, వేలిముద్రలు, కంటిపాప తీసుకుంటున్నారు. ఎవరైనా ఆధార్ లింక్ చేయని వారు వెంటనే చేయాలని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు సూచిస్తున్నారు.

నెలాఖరుతో ముగియనున్న గడువు

రేషన్‌కార్డు ఈ కేవైసీకి తొలుత రాష్ట్ర వ్యాప్తంగా గతేడాది డిసెంబర్ 31 వరకు గడువు విధించగా, అనంతరం గత జనవరి 31 వరకు పొడిగించారు. తాజాగా ఈ నెల 29 వరకు చివరి గడువు విధించారు. జిల్లాలో ఇప్పటి వరకు 72.93 శాతం ఈకేవైసీ పూర్తయింది. వాంకిడి మండలంలో అత్యధికంగా 80.54 శాతం పూర్తి కాగా, లింగాపూర్‌లో అతి తక్కువగా 54.77 శాతం మాత్రమే పూర్తయింది. జిల్లాలోని రేషన్ కార్డు లబ్ధిదారుల్లో కొంత మంది మృతి చెందగా, వారి పేర్లు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. వీరితో పాటు వివాహాలు జరిగిన వారు కూడా కొనసాగుతున్నారు. వాస్తవంగా అసలైన లబ్ధిదారుల ఈకేవైసీ దాదాపు పూర్తయినప్పటికీ, వృద్ధులు, చిన్న పిల్లల వేలి ముద్రలు, కనుపాపలు పడక పోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారు. జిల్లా, మండల కేంద్రాల్లో ఈ కేవైసీపై అవగాహన ఉన్నప్పటికీ, మారుమూల ఏజెన్సీ ప్రాంతాల్లో దీనిపై సరైన అవగాహన లేక పోవడంతో ఆసక్తి చూపడం లేదు. వృద్ధులు, చిన్నపిల్లల వేలిముద్రలు పడని వారికి ప్రత్యామ్నాయం చూపించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

గ్రామాల్లో సమస్యలు లేకుండా చూడాలి


కెరమెరి: మాట్లాడుతున్న ఎంపీడీవో

కెరమెరి: గ్రామాల్లో ఎలాంటి సమస్యలు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో కృష్ణారావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారులు, కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందికి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో చెత్తా చెదారం లేకుండా చూడాలన్నారు. తహసీల్దార్ దత్తుప్రసాద్, ఈజీఎస్ ఏపీవో మల్లయ్య, ఎంపీవో తదితరులు ఉన్నారు.

అర్హులకు పనులు కల్పించాలి

తిర్యాణి: ఉపాధిహామీ పథకంలో భాగంగా అర్హులకు వంద రోజుల పని దినాలు కల్పించాలని ఎంపీడీవో వేముల మల్లేశ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం సమావేశ మందిరంలో ఉపాధిహామీ పథకం అమలు తీరుపై పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. మండల పంచాయతీ అధికారి సుధాకర్ రెడ్డి, ఏపీవో షాకీర్ హుస్సేన్, టీఏలు వోడిగే సాగర్, ముత్తినేని మహేశ్ తదితరులు ఉన్నారు.

అభ్యసన సామర్థ్యాలు పెంపొందించాలి


ఫిజిక్స్ పాఠాలు బోధిస్తున్న డీఈవో అశోక్

తిర్యాణి: విద్యార్థుల్లో కనీస అభ్యసన సామర్థ్యాలు పెంపొందించాలని డీఈవో అశోక్ అన్నారు. మండలంలోని గుడిపేట, గంభీరావుపేట ప్రాథమిక పాఠశాలలను బుధవారం సందర్శించారు. రూం టూ రీడ్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రంథాలయాలను పరిశీలించారు. వాటిని విద్యార్థులు ఏవిధంగా వినియోగించుకుంటున్నారని ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో ప్రగతి, అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో నిర్వహించిన సైన్స్ ఫేర్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించారు. పదో తరగతి విద్యార్థులకు ఫిజిక్స్ పాఠాలు బోధించారు. కార్యక్రమంలో క్వాలిటీ కోఆర్డినేటర్ ఉప్పులేటి శ్రీనివాస్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు అంజయ్య, రూం టూ రీడ్ జిల్లా ప్రతినిధి జెన్నిఫర్ పాల్గొన్నారు.

టీయూటీఎఫ్ కార్యవర్గం ఎన్నిక


నియామకపత్రం అందజేస్తున్న సభ్యులు

దహెగాం: మండల టీయూటీఎఫ్ నూతన కార్యవర్గాన్ని బుధవారం మండల కేంద్రంలో ఎన్నుకున్నారు. టీయూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శాంతికుమార్ ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. టీయూటీఎఫ్ మండల అధ్యక్షుడిగా కంబాల జయేందర్, గౌరవ అధ్యక్షుడిగా ఎల్.నారాయణ, సహాధ్యక్షులు శివకుమార్, శారద, ప్రధాన కార్యదర్శిగా మహేష్, సంయుక్త కార్యదర్శులుగా సదానందం, సాహితి, ఆర్థిక కార్యదర్శిగా తులసీరాం, కార్యదర్శులుగా వంశీ, శ్రీనివాస్, రాజేశ్, ఇందిర, సతీశ్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎన్నికల అధికారి పోచయ్య తదితరులు పాల్గొన్నారు.